

# ఓ(నో)టు కథ

— గుడిసేవ సుందరరామయ్య —

అది ఫిబ్రవరి 24వ తేదీ—సమయం అర్ధరాత్రి—

ఏకగ్రీవంగా ఎన్నికైన ముఖ్యమంత్రిలా ఆకాశంలో నిండుగా నవ్వుతున్నాడు చంద్రుడు. నిండు సభలో కూర్చున్న అసెంబ్లీ సభ్యుల్లా ధగధగలాడుతున్నాయి నక్షత్రాలు. మంచివాడి మనసులా నలుమూలలా వ్యాపించింది పున్నమి వెన్నెల. ఆ వెన్నెల్లో పడిపోయిన శివాలయం ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన అభ్యర్ధి ముఖంలా వుంది.

బీటలిచ్చిన ఆలయ మండపం చీలిపోయిన రాజకీయ పార్టీలా వుంది. దానిమీద పండుకొన్న ఆకారం చిరిగిపోయిన బాలెట్ పేపర్లా వుంది. ఆ ఆకారానికి తల్లిదండ్రులు పెట్టిన పేరు మహాలక్ష్మి. కాని సంఘం పెట్టిన పేరు మాచమ్మ. ఆమె ఆ గూడెంలోకి అడుగుపెట్టి రెండు సంవత్సరాలు దాటింది. ఆమె వచ్చేసరికి మంత్రిగారి కోసం ఏర్పాటు చేయబడిన విడిదిలా పాడుపడ్డ శివాలయం సిద్ధంగా వుంది. ఆలయ మండపాన్నే ఇల్లుగా మార్చుకొంది. తల్లిదండ్రులు ఆమె కిచ్చిన ఆస్తిపాస్తులేమిటో ఎవ్వరికీ తెలీదు. కాని విధి మాత్రం ఆమె కిచ్చిన ఆస్తి అంగవైకల్యం. ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తున్నప్పుడు తన అజాగ్రత్త కారణంగా రెండు కాళ్లను పోగొట్టుకొంది మాచమ్మ. అంతకు ముందే భర్తచే వదిలివేయబడ్డిన్న మాచమ్మ బ్రతుకు ఆ సంఘటనతో బజారున పడింది. జానెడు పొట్టను నింపుకోటానికి అడుక్కోక తప్పలేదు. ఆ గూడెంకు అరమైలు దూరంలో వున్న పట్నంలో పగలంతా అడుక్కొని దీపాలు పెట్టే వేళకు శివాలయం చేరుకొని గిద్దెడు గింజలు ఉడకేసుకు తినటం మాచమ్మకు నిత్య దినచర్య.

నాల్గు రోజులుగా విపరీతమైన జ్వరం కాయటంతో బయటకు వెళ్లటానికి బద్ధకించింది. దాచుకొన్న బియ్యం కూడా ముందు రోజు రాత్రే అయిపోయాయి. ప్రొద్దున్నుంచీ ఒంట్లో బాగో లేదు. శరీరంలో నీరసం ఎక్కువైంది. కడుపులో ఆకలి ఒత్తిడి చేస్తూంది. అయినా ఆమె కళ్లు మాత్రం రోడ్డువైపుకు మాస్తూనేవున్నాయి. దీపాలు పెట్టిన వేళనుంచి ఆమె చూపు అటే వుంది.

ఆమె మనసులో ఓ చిన్న ఆశాదీపం మిణుకు మిణుకుమంటూ వుంది.

'ఏ చణంలోనైనా ఆ మా రాజులు రావొచ్చు. గూడెంలో వోళ్లంతా సందేలకే గూళ్లు సేరుకొన్నారు. ఈ రోజు పోతే యిలాంటి రోజు అయిదు యేళ్లవరకు రాదంట. తనుకూడా అందుకనే యేయి కళ్లతో సూతూంది ఆళ్లకోసం. ఆళ్లొత్తారు. తమ బాధలు కళ్లారా సూత్తారు. జరుగుతూంది. ఈ ఎలచ్చన్లు పతి యేటా వుంటే బాగుణ్ణు — మడిసి మడిసికీ పదినోటు యిత్తారంట ఎంత దయ ఆళ్లకు? తమలాంటోళ్లను ఆదుకొంటారంట ఆళ్లు. ఆళ్ల కడుపులు సల్లగుండాల!'

ప్రక్కనే వున్న ఊత కర్రలను తీసుకొని వాటి సాయంతో లేచినిలబడింది. అడుగులో అడుగు వేసుకుంటూ క్రొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీలా జాగ్రత్తగా నడవసాగింది. మండపం మెట్లను ఒక్కటొక్కటే దిగి క్రిందికి వచ్చింది గద్దెలు దిగి ప్రజలసాధ్యకు వచ్చిన నాయకునిలా. చుట్టూ చూసింది ఆశగా

ఆ చుట్టు ప్రక్కల ప్రదేశమంతా రాళ్ల రప్పలతోను, పిచ్చి మొక్కలతోను నిండిపోయింది. వెర్రితలలు వేస్తున్న ఆధునిక నాగరికతలా ముళ్ల చెట్లు అసహ్యాన్ని కలిగిస్తున్నాయి. తీరు తెన్నులేని రాజకీయ పార్టీల్లా అస్తవ్యస్తంగా మొలకెత్తిన మొక్కలు భయాన్ని కల్గిస్తున్నాయి

మాచమ్మ దృష్టి ఓ మొక్క మీద పడింది.

పదవీ స్వీకారం కోసం పరిగెత్తే మంత్రిలా గబగబ నడిచింది మాచమ్మ.

కామాక్షి చెట్టు నిండా కాయలున్నాయి.

ఎర్రగా పండిన పళ్లను చూడగానే మాచమ్మ ఆగలేక పోయింది.

ఆత్రంగా చేతికందిన పళ్లను త్రుంచి నోట్లో వేసుకొంది.

దూరంగా కారు హారన్ విన్పించగానే ఉలిక్కిపడి చూసింది.

ఒకదాని వెనుక మరొకటి మూడు కార్లు కన్పించాయి.

వాటిని చూడగానే ఆమె కళ్లల్లో ఆనందం తొణికిసలాడింది.

ధనరాసులు తరలి వెళ్తున్నట్లు కన్పించింది ఆమె కంటికి

ఊత కర్రల సాయంతో రోడ్డు మీదికి వచ్చింది.

కార్లు రేపిన దుమ్ములో దారిని వెతుక్కొంటూ గూడెం వైపు నడిచింది.

కార్లు గూడెంలో ఆగిపోయాయి.

బాలెట్ పెట్టెలు గుమ్మరించగానే బయటపడ్డ బాలెట్ పేపర్లలా కార్లలోంచి జనం బయటకు వచ్చారు.

వాళ్లలో ఓ వ్యక్తి చేతిలో బ్రీఫ్ కేసుంది గూడెంలోని పెద్దతలకాయలు దణ్ణాలు పెట్టుకొంటూ వాళ్లకెదురు వెళ్లారు.

మాచమ్మ ఓ ప్రక్కగా నిలబడి తదేకంగా చూడసాగింది.

బ్రీఫ్ కేసు తెరవగానే రూపాయల కట్టలు తళుక్కుమన్నాయి.

డబ్బు కన్పించగానే మాచమ్మకు కంగారెక్కువైంది. ఓట్లు లెక్కిస్తున్నప్పుడు పోటీ చేసిన అభ్యర్ధి హృదయం ఎలా కొట్టుకొంటుందో అంత కంటె రెట్టింపు వేగంగా కొట్టుకోసాగింది మాచమ్మ హృదయం

# ఓ (నో) టు కథ

అంటూ చేతులెత్తి టాటా చెప్పేసి కార్లలో ఎక్కికూర్చున్నారు వచ్చినవాళ్లు.

కార్లు వెళ్లిపోగానే గూడెంలోని జనమంతా సబ్బుచుట్టూ చేరారు.

ఒక్కొక్కరు పదిరూపాయలనోటును తీసుకు వెళ్తుంటే మాచమ్మ గుడ్లప్పగించి చూస్తుండి పోయింది.

జనం ఒత్తిడి కాస్త తగ్గాక మాచమ్మ కూడా డబ్బు పంచే వ్యక్తి దగ్గరకు వెళ్లింది

"బాబూ! నా పేరు మాచమ్మ! ఆ శివాలయంలో వుంటున్నాను. నాక్కూడా పైస ఇప్పించండి!" అని అడిగింది.

"ఏం పైసలు?" అన్నాడతను మాచమ్మను వింతగా చూస్తూ.

"ఆ మారాజులిచ్చిన పైసలు బాబూ!"

"నీకు ఓటు లేదు. పైసలు రావు!" అన్నాడతను.

మాచమ్మకు గుండె ఆగినంత పనైంది

"అదేం అన్నేయం బాబూ! నాను కూడా మీలానే మడిసినే కదా! నాను కూడా ఆ మారాజుకే ఓటు సేత్తా! పైసలిప్పించండి!"

"పైసల్లేవు గియసల్లేవు పో!" అంటూ కసిరాడు ఆ వ్యక్తి.

మాచమ్మకు పిచ్చెక్కినట్లయింది.

"దయసూపండి బాబూ! నా కడుపు కొట్టకండి!" దీనంగా వేడుకొంది. కళ్ల వెంట నీళ్లొచ్చాయి.

"ఈ ఎదు పేదో ముందే ఏడ్చి ఓటు రాయించుకోపోయావా!" మాచమ్మ వయసే వున్న ఓ ఆడమనిషి అంది మెల్లగా.

మాచమ్మ ఆ ఆడమనిషి దగ్గరకు వెళ్లింది.

"నువ్వయినా నాకు దారి సూపు తల్లీ! మీ అందరికీ ఓటు లెవరు రాశారు?" ఆత్రంగా అడిగింది.

"ఈపేట కవున్సిలరుగా సేసిన లాయరు బాబు! ఆయనే మా అందరికీ ఓట్లు రాయించారు. ఎవరికైనా తినే ప్రాప్తం వుండాలి. గవర్నమెంటోళ్లు వెయ్యిరూపాయల నోట్లు రద్దు సేయకపోతే మా మారాజులు మా అందరికీ వెయ్యిరూపాయల నోట్లు పంచేవోరంట. ఏం సేత్తాం? ఎక్కడికక్కడికే తృప్తి. పాపం! నీకు అది కూడా ప్రాప్తంలేదు!" ఆడమనిషి ఆగకుండా మాట్లాడేసింది.

కాని మాచమ్మ అవేం విన్పించుకొనే స్థితిలో లేదు. లాయర్ బాబు ఓట్లు రాయించాడన్న ముక్క ఆమె మనసులో ప్రవేశించింది.

మరుక్షణమే పట్నంలో వున్న లాయర్ గారిల్లు మాచమ్మ మనస్సులో మెదిలింది. ఆ వార్డు కౌన్సిలర్‌గా చేసిన లాయర్ చిదంబరం మాచమ్మకు బాగా తెల్సు. ఎందుకంటె ప్రతి ఏటా లాయర్ గారు తన తండ్రి తద్దినానికి మాచమ్మ లాంటి అభాగ్యులకు అన్నదానం చేస్తుంటాడు.

మాచమ్మ ఇక ఆలస్యం చేయలేదు.

లాయర్ గారింటికి బయల్దేరింది.

అక్కడికి దాదాపు అరమైలు దూరం వుంది.

ఒంట్లో ఓపిక లేదు అయినా పట్టుదల కొద్దీ బయల్దేరింది

లాయర్ గారింటి గేటు ముందు నిలబడి బిగ్గరగా అరిచింది.

"లాయరు బాబూ! లాయరు బాబూ!" అంటూ.

లాయర్ గారయితే ఆమె మొరవినలేదు కాని ఆయన పెంచుతున్న కుక్క మాత్రం అమాంతంగా వచ్చి మాచమ్మ మీద పడింది.

అంతే!

మాచమ్మ రోడ్డు మీద పడిపోయింది.

పళ్లు బాగా లోతుగా దిగటం చేత రక్తం బయటకు చిమ్మింది.

బాధను భరించలేక "నాయనో, బాబో!" అంటూ శోకాలు పెట్టింది. అదే సమయంలో ఆ రోడ్డుమీద పోతున్న రిక్షా ఒకటి రక్కున ఆగిపోయింది. అందులోంచి ఓ వ్యక్తి దిగి "ఏం జరిగిందమ్మా?" అని అడిగాడు.

"లాయరు గారింటి కెళితే కుక్క కరిసింది బాబూ!" అంది మాచమ్మ ఏడుస్తూనే

"ఇంత అర్ధరాత్రి వేళ ఎందుకొచ్చావ్?"

"ఓటు రాయించుకొందామని"

ఆ వ్యక్తి క్షణం పాటు ఆశ్చర్యపోయాడు

"ఎందుకు?" అని అడిగాడు

"అదేంటి బాబూ! తెలవనట్టు అడుగుతారు! లాయరుగారు ఓటు రాత్తేగాని గూడెంలో డబ్బులియ్యరంట!"

"డబ్బులేమిటి?"

"కార్లేసుకొని మారాజులొచ్చారు మడిసి మడిసికి పదినోటిచ్చారు నానుకూడా అడిగితే ఓటు లేదన్నారు. అందుకనే రాయించుకోటాని కొచ్చాను" అంది మూల్గుతూ.

ఆ వ్యక్తికి పరిస్థితి అర్థమైంది.

చిన్నగా నవ్వుకొన్నాడు.

"ఎంత పిచ్చిదానివమ్మా! ఓట్లు రాయటమంటే అంత తేక పనికాదు లాయరుగారు కాదుకదా బ్రహ్మదేవుడు కూడా ఈ రాత్రికి రాత్రే నీకు ఓటు రాయలేడు!"

"అయ్యో దేముడా! ఎరక్కపోయొచ్చాను పాణం బాగోపోయినా వోపిక సేసుకొని ఆశతో వొచ్చాను బాబూ! నా గెహవారం బాగలేదు. ఏదో పది రూపాయి లొత్తాయిగందా వోరం రోజులు గడిసిపోతాయని ఆశతో వొచ్చాను. పాడు కుక్క కండలు పీకేసింది" అంటూ శోకాలు పెట్టింది మాచమ్మ.

"ఇదిగో మామ్మా! నీవు శోకాలు పెట్టడం వలన ప్రయోజనం లేదు. నీక్కావాల్సింది పది రూపాయిలేకదా! నేనిస్తాను!" అంటూ జేబులోంచి నోటు తీసి మాచమ్మకు అందించాడు.

ఎలక్షన్స్‌లో అత్యధిక మెజారిటీతో నెగ్గిన అభ్యర్థి ముఖంలా ఆమె ముఖం కళ కళ లాడింది.

"తవరెంత మంచోళ్లు బాబూ!" అంది చేతులెత్తి దణ్ణం పెడ్తూ.

"కుక్క కరిచింది. అశ్రద్ధ చేయకూడదు. రోజూ ధర్మాసుపత్రికి వెళ్లి ఇంజక్షన్స్ తీసుకో!"

"అలాగే బాబూ!"

ఆ వ్యక్తి రిక్షావాణ్ణి పిల్చి "చూడు రాములూ! ఈమెను డాక్టర్ శర్మగారి హాస్పిటల్‌కు తీసికెళ్లి కట్లు కట్టించు రేపట్నుంచీ ధర్మాసుపత్రికి వెళ్లి ఇంజక్షన్స్ చేయించుకొంటుంది!" అన్నాడు.

రిక్షావాడి సహాయంతో మాచమ్మను రిక్షాలో కూర్చుండబెట్టి, వంకరటింకర్లు లేకుండా నిలువుగ, నిటారుగా వున్న రోడ్డుమీదికి వచ్చి వడివడిగా అడుగులు వేసుకొంటూ వెళ్లిపోయాడు ఆ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సౌజన్యరావు.

